

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 15-05-2025 | సంపుటి - 24 | సంచిక - 13 | రూ : 4 | పేజీలు: 8

## నేటి నుంచి
# సరస్వతి పుష్కరాలు

- వేకువ జామున 5.44 గంటలకు కాళేశ్వరంలో లాంఛనంగా ప్రారంభం
- సాయంత్రం పుష్కర స్నానాలు ఆచరించనున్న సీఎం దంపతులు

**మే 14, హైదరాబాద్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో గురువారం నుంచి సరస్వతి నది పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు తరువాయి 2లో





## అరబ్ దేశాల సంపదను చూసి
# ఆశ్చర్యపోయిన ట్రంప్

- శ్వేతసౌధం, అధ్యక్షుడి విమానాలను ఆధునికీకరించాలేమోనని వ్యాఖ్య

**మే 14, దోహా:** అమెరికా అధ్యక్షుడంటే.. ప్రపంచంలోనే అత్యంత శక్తి మంతమైన నేత. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థకు, బలమైన సైన్యానికి అధిపతి. అలాంటి అమెరికా అధ్యక్షుడే.. అరబ్ దేశాల తరువాయి 2లో

## ఎలా కట్టకూడదో చెప్పేదే..
# కాళేశ్వరం



- రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి 50 వేల ఎకరాలకైనా నీరు ఇవ్వలేదు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎస్సెల్బీసీలో ఎనిమిది మంది బలి
- నీళ్లు, నిధులు, నియామకాల భావోద్వేగాన్ని కొందరు రాజకీయాలకు వాడుకొన్నారు
- ఇంజినీర్లు, జేటీవోలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

## చెడగొట్టు వానలతో
# ఆశలు చెల్లాచెదురు!



- ములుగు జిల్లాలో 1,300 బస్తాల ధాన్యం నీటిపాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 600కిపైగా కల్లాల్లో వడ్లకు నష్టం
- మంచిర్యాల జిల్లా సారంగపల్లిలో తడిసిన 250 క్వింటాళ్ల ధాన్యం

కొనుగోళ్లలో ఆలస్యమే కారణమని రైతుల ఆరోపణ

2లో

# ముద్దచర్మ వ్యాధి నియంత్రణకు టీకా



- 'బయోలంపీ వ్యాక్సిన్'ను అభివృద్ధి చేసిన భారత్ బయోటెక్ అనుబంధ సంస్థ బయోవెట్
- 'ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- 'ప్రపంచంలోనే తొలి దివా మార్కర్ వ్యాక్సిన్

**మే 14, అమరావతి:** పాల ఉత్పత్తిని దెబ్బతీస్తూ.. పాడిపశువుల పాలిట మహమ్మారిగా తయారైన ముద్దచర్మ వ్యాధి (లంపీస్కిన్ డిసీజ్ ఎల్ఎస్‌డీ) నియంత్రణకు టీకా అందుబాటులోకి వచ్చింది. భారత్ తరువాయి 2లో

## 400-600 చ. అడుగుల్లోపే
# ఇందిరమ్మ ఇళ్లు

- ఆకృతిని మార్చుకోవచ్చు.. విస్తీర్ణం మాత్రం పెంచకూడదు

**మే 14, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మొదటి, రెండో విడత కలిపి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో గ్రేటర్ తరువాయి 2లో





## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
# జస్టిస్ గవాయ్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం
- హాజరైన ప్రధాని, కేంద్ర మంత్రులు

**మే 14, ఢిల్లీ:** భారత 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో హిందీలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జె.పి.నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ తర్వాత సీజేఐ అయిన రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్. బౌద్ధుల నుంచి ఈ పీఠాన్ని అధిరోహించిన తొలివ్యక్తి ఆయనే. 1960 నవంబరు 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన ఆయన 1985లో న్యాయవాద వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నాగ్‌పూర్, అమరావతి నగరపాలక సంస్థలు; అమరావతి విశ్వవిద్యాలయానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. సహాయ ప్రభుత్వ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేశాక బొంబాయి హైకోర్టుకు తరువాయి 2లో

## రామప్ప శిల్పాలే..
# ప్రాణం పోసుకొనెనా..!

- అపురూప శిల్పాల చెంత అందమైన భామలు
- ఓరుగల్లులో ప్రపంచ సుందరి పోటీదారుల సందడి
- సంప్రదాయ వస్త్రధారణతో ఆలయాల సందర్శన



2లో

# ఎలా కట్టకూడదో చెప్పేదే.. కాళేశ్వరం

హైదరాబాద్: 'రాష్ట్రంలో నీళ్లు పారలేదు కానీ నిధులన్నీ ఒకే కుటుంబానికి పారాయి. నీళ్లు, నిధులు, నియామకాలు అనే భావోద్వేగాన్ని కొంత మంది రాజకీయాలకు వాడుకొన్నారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధిపొందాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నాటి పరిస్థితులకు అనుగుణంగా నీటిపారుదల శాఖకు ప్రాధాన్యం ఇచ్చారు. భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీలకు నెహ్రూ పునాది వేశారు. ఆ ప్రాజెక్టులు వందేళ్లైనా చెక్కు చెదరలేదు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలింది. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా లేదు' అని అన్నారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన 244 మంది ఏఈలకు, 199 మంది జేటీవోలకు బుధవారమిక్కడ జలసౌధలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. కొత్తగా నీటిపారుదల శాఖలో చేరి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్నారంటూ నియామక పత్రాలు అందుకున్న వారికి అభినందనలు తెలియజేశారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను చూసి ప్రాజెక్టులు ఎలా నిర్మించాలో తెలుసుకోవాలని, కాళేశ్వరం చూసి ఎలా కట్టకూడదో నేర్చుకోవాలని సీఎం ఉద్బోధించారు.

*** ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?**

''రూ.రెండు లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన తెలంగాణ ప్రాజెక్టులు పూర్తి కాలేదు... ఎందుకని? ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? మేధావులు, ఉద్యోగులు ఈ విషయమై ఆలోచించాలి. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. అందుకే నీటిపారుదల శాఖలో ఖాళీలను భర్తీ చేస్తున్నాం. ఈ 15 నెలల కాలంలో నీటిపారుదల శాఖలోనే 1,161 ఖాళీలను నింపాం.

*** కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1.45 లక్షల కోట్లు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన కోయిల్‌సాగర్, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టుల విషయంలో పాలకుల నిర్లక్ష్యంతో అన్యాయం జరిగింది. సమ్మక్కసాగర్, ప్రాణహిత ప్రాజెక్టులు ప్రారంభమయినా తెలంగాణ వచ్చాక ఏదీ పూర్తికాలేదు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ శాఖను అప్పగించాం. కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1.45 లక్షల కోట్లు. గత ప్రభుత్వ హయాంలో రూ.1.02 లక్షల కోట్ల బిల్లులు ఇచ్చారు. నేను సీఎం అయ్యే నాటికి రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. కానీ 50 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా సాగునీరు అందలేదు.

*** నాడు పెద్ద సారు చెప్పినట్లు బ్యారేజీలు కట్టేశారు**

పూరిగుడిసె కట్టినా పునాది తవ్వి మట్టి ఎలా ఉందో చూస్తారు. కాళేశ్వరం బ్యారేజీల్లోకనీసం మట్టి పరీక్షలు చేయలేదు. పెద్ద సారు హెలికాప్టర్‌లో తిరుగుతూ పై నుంచి అక్కడ కట్టు... ఇక్కడ కట్టు అంటే అలాగే బ్యారేజీలు కట్టేశారు. తానే ఇంజినీరును, తానే డిజైనర్‌ను అన్నట్లుగా వ్యవహరించారు. మట్టి పరీక్షలు కూడా చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది. ఇంజినీరింగ్ పనులను ఇంజినీర్లను చేయనీయాలి. అలా కాకుండా వారి పనిలో చొరబడితే ఏమవుతుందో తెలియడానికి కేసీఆరే నిలువెత్తు ఉదాహరణ. ప్రజాప్రతినిధులు ఎవరూ అలా చేయొద్దు.

*** అందరిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏలు చెప్పాయి**

ఒక ఇంజినీరు 30 ఏళ్లు పనిచేస్తే ఈఎన్సీ అవుతారు. పరిమిత జ్ఞానంతో రాజకీయ నాయకులు చెప్పింది చేస్తే ఊచలు లెక్కించాల్సి వస్తుంది. కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏలు ఇచ్చిన నివేదికల్లో అధికారులే బాధ్యులని రాశారు. మొత్తం అధికారులను ఉరి తీయమని ఆ నివేదికల్లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో లోపభూయిష్ఠ నిర్మాణాలతో ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఎప్పుడు ఏది కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల పిల్లర్లు పేకమేడలా కూలిపోతున్నాయి. ఇటీవల సీతారామసాగర్ పిల్లర్లు కూలాయి. ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిడులకు లొంగవద్దు. నిర్మాణాలకు సంబంధించి ప్రజాప్రతినిధులు ఏ సూచనలు చేసినా బాధ్యులు మాత్రం మీరే అవుతారని గ్రహించండి.

*** నిపుణుల సూచన మేరకు ముందుకు**

రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో మా ప్రభుత్వం నిపుణుల సూచనల మేరకు ముందుకు వెళ్తోంది. 75 శాతం పూర్తయిన ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 44 కిలోమీటర్ల పొడవుతో చేపట్టిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం నిర్లక్ష్యానికి గురైంది. నాడు 25 కిలోమీటర్ల తవ్వకం పూర్తయితే రాష్ట్రం ఆవిర్భవించాక పదేళ్లలో పది కిలోమీటర్లు కూడా పూర్తి కాలేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పదేళ్లు పనులు కదలకుండా ఉండటంతో యంత్ర సామగ్రి మట్టిలో కూరుకుపోయి ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇచ్చేందుకు చేపట్టిన ఎస్సెల్బీసీకి రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పూర్తయ్యేది. ప్రజల సెంటిమెంట్ నీళ్లు. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులు పూర్తి చేయాలి. రాష్ట్రంలో నిధుల కొరత ఉంది. అయినా ఏదో ఒక ప్రయత్నం చేస్తాం. మొదటి ప్రాధాన్యంగా ఉన్న ఎస్సెల్బీసీ, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, సీతారామసాగర్, సమ్మక్కసాగర్, దేవాదుల తదితర ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.

## నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు వస్తున్నాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా... గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు.

**సరస్వతి నవరత్న మాల హారతి**

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది. పుష్కరాల నేపథ్యంలో నదీ జలాలు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల్ని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సరస్వతి నది పుష్కరాల పోస్టర్‌ను పీసీబీ అధికారులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఆవిష్కరించారు.

## చెడగొట్టు వానలతో ఆశలు చెల్లాచెదురు!

ఏటూరునాగారం రూరల్, మందమర్రి పట్టణం: అకాల వర్షం మరోసారి అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చింది. ధాన్యం గింజలు కళ్లెదుటే వరద నీటిలో కొట్టుకుపోతుంటే వారు తల్లడిల్లారు. చెడగొట్టు వానలతో తమ ఆశలు గల్లంతయ్యాయని వాపోతున్నారు. ములుగు, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున భారీ వానలు కురిశాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో బుధవారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కురిసిన వర్షంతో ఊరవాగుకు వరద పోటెత్తింది. దాంతో సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నీట మునిగింది. రవాణాకు సిద్ధంగా ఉన్న 600 బస్తాలతోపాటు ఆరబోసిన మరో 700 బస్తాల ధాన్యం ప్రవాహంలో కలిసిపోయింది. హమాలీలు, లారీల కొరత, కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. యాభై మందికిపైగా అన్నదాతలకు రూ.30 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఐటీడీఏ పీవో చిత్రామిశ్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ''మూడెకరాల్లో పండించిన పంటను 20 రోజుల కిందట కేంద్రానికి తీసుకొచ్చాం. తేమ పేరుతో ఆలస్యం చేశారు. లారీలు కూడా రావడం లేదన్నారు. చూస్తుండగానే పంటంతా నీటి పాలైంది. ఏం చేయాలో తోచడంలేదు'' అని స్థానిక రైతు బండారి సుజాత రోదించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం జరిగిందని ములుగు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆరోపించారు. నీట మునిగిన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపించాలని కోరారు.

**కల్లాల్లో ధాన్యం కదల్లేదు**

బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కరీంనగర్ జిల్లా వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట, మానకొండూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, జగిత్యాల జిల్లా ధర్మపురి, పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరు వందలకుపైగా కల్లాల్లోని వడ్ల కుప్పలు తడిసిపోయాయి. కొన్నిచోట్ల తేమ కారణంతో కాంటా పెట్టకపోగా, ఇంకొన్నిచోట్ల హమాలీలు, బస్తాల కొరతతో సేకరణ ఆలస్యమవుతోందని రైతులు ఆరోపించారు.

## 400..600 చ. అడుగుల్లోపే ఇందిరమ్మ ఇళ్లు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మొదటి, రెండో విడత కలిపి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో గ్రేటర్ హైదరాబాద్‌ను మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక్కో గ్రామం చొప్పున 562 గ్రామాల్లో 70,122 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 47,335 మంది లబ్ధిదారులకు అనుమతులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించారు. ఇప్పటివరకు 17,962 మంది ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసుకోగా.. 6,132 మంది పునాది వరకు పూర్తి చేసుకున్నారు. ప్రధానంగా ఇంటి నిర్మాణ కొలతలపై లబ్ధిదారుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండో విడతలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యల వివరాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ 'ఈనాడు'కు వెల్లడించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**అంగీకార పత్రం ఇస్తే మరో అవకాశం..**

ఇందిరమ్మ ఇళ్లను కచ్చితంగా 400600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతోనే నిర్మాణం పూర్తయ్యేలా ప్రతి మండలంలో నమూనా ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారులు ఆకృతిలో తమకు నచ్చిన మార్పులు చేసుకోవచ్చు. విస్తీర్ణం మాత్రం పెంచకూడదు. గతంలో 560 చదరపు అడుగుల్లో రెండు పడకగదుల ఇళ్లు నిర్మించాం. ఇప్పుడూ 600 చదరపు అడుగుల వరకు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అవకాశం ఇస్తున్నాం. ఇందులో ఇల్లు విశాలంగా ఉంటుంది. రెండు పడకగదులు, హాలు, కిచెన్, రెండు బాత్రూంలు వస్తాయి. మొదటి విడతలో 370 మంది లబ్ధిదారులు 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో పునాది వేసుకున్నారు. వీరికి మరో అవకాశం ఇస్తున్నాం. 600 చదరపు అడుగులకు కుదించుకుని శ్లాబు వేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఇలా చేస్తామని అంగీకార పత్రం ఇస్తే బిల్లులు అందిస్తాం.

**ప్రతి సోమవారం బిల్లుల సొమ్ము జమ**

పునాది పూర్తి కాగానే లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లులు అందిస్తున్నాం. పునాది పూర్తిచేసుకున్న వారిలో ఇప్పటివరకు 3,757 మందికి రూ.37.57 కోట్లు మంజూరు చేశాం. గ్రామ కార్యదర్శి ఏఈడీఈ పీడీ జిల్లా కలెక్టర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు దశలవారీగా ఆన్‌లైన్‌లో బిల్లుల కోసం వివరాలు నమోదు చేస్తారు. హౌసింగ్ కార్పొరేషన్ లాగిన్‌కు రాగానే వెంటనే లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమ చేస్తున్నాం.

**వేగంగా రెండో విడత ఎంపిక**

రెండో విడతలో లబ్ధిదారుల ఎంపిక వేగంగా జరుగుతోంది. మండలస్థాయిలో మొత్తం 2,75,681 మంది లబ్ధిదారుల వివరాలపై విచారణ జరిపారు. వీరిలో 2,28,137 మందిని అర్హులుగా గుర్తించారు. జిల్లాస్థాయిలో 2,20,137 మందికి అధికారులు అనుమతులు ఇచ్చారు. రెండో విడతలో ఇప్పటివరకు 57,430 మందికి వ్యక్తిగతంగా ప్రొసీడింగ్స్ ఇవ్వగా.. వారు పనులను ప్రారంభించుకుంటున్నారు. మిగిలినవారికి కూడా త్వరలోనే అనుమతి పత్రాలు అందిస్తాం. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3లో జాబితాల్లో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఎల్ 3 జాబితాలోనూ అర్హులైనవారు ఉంటే వారిని ఎల్ 1 జాబితాకు మార్చి అనుమతులు ఇస్తున్నాం. జీహెచ్ఎంసీలో మాత్రం మురికివాడల్లోనే జీ+3లో ఇళ్లను కట్టించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకోసం స్థలాలను గుర్తించే ప్రక్రియను త్వరలోనే చేపడతాం.

**సిమెంటు, ఇనుముపై త్వరలో నిర్ణయం..**

సిమెంటు, ఇనుము ధరలు పెరిగాయని మా దృష్టికి వచ్చింది. లబ్ధిదారులపై భారం పడకుండా సిమెంటు, ఇనుము సరఫరా చేసే కంపెనీలతో సమావేశం నిర్వహించాం. లబ్ధిదారులకు తక్కువ ధరకు అందించాలని కోరాం. ఇసుకను ఉచితంగానే అందిస్తున్నాం.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన నాగ్‌పుర్ ధర్మాసనంలో 2003లో అదనపు న్యాయమూర్తిగా, 2005లో అక్కడే శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆరేళ్లలో సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. 370 అధికరణం రద్దు, ఎన్నికల బాండ్ల రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎస్సీల వర్గీకరణ వంటి అనేక సంచలనాత్మక కేసులలో తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన ఈ ఏడాది నవంబరు 23 వరకు కొనసాగుతారు. నూతన హోదాలో సుప్రీంకోర్టుకు రాగానే అక్కడ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పాలతో ఆయన నివాళులర్పించారు. తండ్రి మాజీ గవర్నర్ జస్టిస్ గవాయ్ తండ్రి దివంగత ఆర్.ఎస్.గవాయ్ అంబేద్కర్ వాది. బిహార్, కేరళ రాష్ట్రాలకు గవర్నర్‌గా, అంతకు ముందు ఎంపీగా ఆయన సేవలందించారు. తనకు మాత్రం రాజకీయాలపై ఆసక్తి లేదని నూతన సీజేఐ చెప్పారు. పదవీ విరమణ తర్వాత ఎలాంటి బాధ్యతలు తీసుకోవాలనుకోవడం లేదని, ఇతర పదవులన్నీ కూడా సీజేఐ కంటే తక్కువేనని అభిప్రాయపడ్డారు. నూతన ప్రధాన న్యాయమూర్తికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ప్రమాణం పూర్తయిన వెంటనే నూతన సీజేఐ తన తల్లి కమల్‌తాయ్ గవాయ్‌కి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. 'తండ్రి అడుగుజాడల్లో నడిచి నా పిల్లలు సమాజానికి సేవ చేయాలని కోరుకుంటున్నాను. ప్రజల్ని గౌరవించి, స్థాయితో సంబంధం లేకుండా వారికి న్యాయం చేయాలి. అనేక కష్టాలు అధిగమించి, క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొని నా తనయుడు ఈ స్థాయికి చేరడం ఎంతో సంతృప్తినిస్తోంది' అని కమల్‌తాయ్ చెప్పారు.

## ముద్దచర్మ వ్యాధి నియంత్రణకు టీకా

(మొదటిపేజీ తరువాయి)

బయోటెక్ అనుబంధ సంస్థ బయోవెట్ తయారు చేసిన ఈ టీకాను బుధవారం విజయవాడలో జరిగిన పశుసంవర్ధక రంగ ఏఐ టెక్ 2.0 సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. లంపీస్కిన్ వ్యాధి నియంత్రణకు టీకాను ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా బయోవెట్ సంస్థ రూపొందించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ టీకా ఎంతో దోహదపడుతుందని ప్రశంసించారు. భారత్ బయోటెక్ సీడీఓ డాక్టర్ రేచస్ ఎల్లను సీఎం చంద్రబాబు అభినందించారు.

**అత్యంత సురక్షిత టీకా**

బయోవెట్ ఆధ్వర్యంలో రూపొందించిన బయో లంపీ వ్యాక్సిన్ ప్రపంచంలోనే తొలి.. అత్యంత సురక్షితమైన దివా మార్కర్ వ్యాక్సిన్ అని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. లంపీ స్కిన్ నిర్ధారణ, నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. హిస్సార్‌లోని ఐసీఏఆర్ ఎన్ఆర్‌సీ (నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ ఈక్విన్స్) అందించిన ఎల్ఎస్‌డీ వైరస్/ రాంచీ/ 2019 వ్యాక్సిన్ స్ట్రెయిన్‌తో బయోవెట్ సంస్థ దీన్ని అభివృద్ధి చేసినట్లు వివరించారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. టీకాల కోసం విదేశాలపై ఆధారపడకుండా మన వ్యాక్సిన్ మన దేశంలోనే అభివృద్ధి చేయాలనే బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, బయోవెట్ వ్యవస్థాపకుడు కృష్ణ ఎల్ల ఆలోచనల నుంచి టీకా రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు.

## రామప్ప శిల్పాలే.. ప్రాణం పోసుకొనెనా..!

వరంగల్, మహబూబాబాద్ : కాకతీయ శిల్పకళను చూస్తూ.. ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదిస్తూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఆసక్తిగా గమనిస్తూ ప్రపంచ సుందరి పోటీదారులు సందడి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యేళ్ల చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, రామప్ప దేవాలయాలను సందర్శించారు. ఆ రాతి కట్టడాలను తాకుతూ అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న లాటిన్ అమెరికా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు బుధవారం వరంగల్ నగరంలో పర్యటించగా ఐరోపా ఖండంలోని 35 దేశాలకు చెందిన అందగత్తెలు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 'హలో తెలంగాణ.. అందరూ బాగున్నారా' అంటూ పలకరించారు.

**సంప్రదాయ చీరకట్టులో వచ్చి.. బతుకమ్మలతో ఆడిపాడి**

హైదరాబాద్ నుంచి పర్యాటక శాఖకు చెందిన ప్రత్యేక బస్సుల్లో బుధవారం సాయంత్రం 4.42 గంటలకు హనుమకొండకు చేరుకున్న అందాలభామలకు మెడలో పూలమాల వేసి వారిపై పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలు, సన్నాయి వాయిద్యాలతో ఆహ్వానించారు. సుందరీమణులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం భారతీయ కట్టూబొట్టుతో వేయిస్తంభాల గుడిని సందర్శించారు. ఆలయ చరిత్రను అక్కడి గోడలపై ఉన్న శాసనాల ద్వారా గైడ్‌లు అతిథులకు వివరించారు. ఒక్కొక్కరూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇత్తడి పళ్లెంలో కాళ్లు కడుక్కొని ఆలయంలోకి అడుగు పెట్టారు. ఆలయంలోని స్తంభాలు, శిల్పాలతో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం రుద్రేశ్వరుడిని దర్శించుకోగా అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. అక్కడి నుంచి ఖిలా వరంగల్‌కు చేరుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో ప్రఖ్యాతి గాంచిన చపాటా మిర్చి, పసుపు, ఓరుగల్లు దరీస్, రంగశాయిపేట షీల్డ్‌ల స్టాళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడికి చేరుకున్న అందగత్తెలకు అధికారులు చపాటా మిర్చి, పసుపుకొమ్ములను ఇస్తూ స్వాగతం పలికారు. ఖిలా వరంగల్‌లో ప్రతి రాయి, శిల్పాల విశేషాలను గైడ్‌లను అడుగుతూ చరిత్ర తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెండ్యాల లక్ష్మిప్రియ, నటరాజ రామకృష్ణ బృందాలు చేసిన రుద్రమదేవి, పేరిణి శివతాండవం నృత్యాలు ఆహూతులను అలరించాయి. అనంతరం 'ఓరుగల్లు ఆతిథ్యం మరిచిపోలేనిది. మేం చూసిన నృత్యాలు ఇక్కడి చరిత్రను తెలియజేస్తున్నాయి. ఈ చల్లటి సాయంత్రం వేళ మీరిచ్చిన అనుభూతి మాకు ఎప్పటికీ గుర్తుంటుంది. తెలంగాణను ప్రేమిస్తున్నాం. తెలంగాణ, జరూర్ ఆనా'' అని అర్జెంటినా, పనామా, అమెరికా, కెనడాలకు చెందిన పోటీదారులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి సురేఖ, ఎంపీ కావ్య అతిథులకు షీల్డ్‌లు, ఓరుగల్లు దరీస్‌ను బహుమతులుగా అందజేశారు.

## అరబ్ దేశాల సంపదను చూసి ఆశ్చర్యపోయిన ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

సంపదను, విలాసాన్ని చూసి ఆశ్చర్యపోయారు. నాలుగు రోజుల గల్ఫ్ దేశాల పర్యటనలో అరబ్ నేతలు ఇచ్చిన ఆతిథ్యం డొనాల్డ్ ట్రంప్‌ను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఖతారీ ప్యాలెస్‌లోని పాలరాయిని చూసి అద్భుతమని ట్రంప్ మెచ్చుకున్నారు. దానిని సొంతం చేసుకోవడం ఎంతో ఖర్చుతో కూడకున్నది కావొచ్చని వ్యాఖ్యానించారు. ఖతార్ ఎమిర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. సౌదీ అరేబియాలోని ధగధగ మెరిసే విమానాలపైనా ఆయన ప్రశంసలు కురిపించారు. వాటితో పోలిస్తే తన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎంతో చిన్నదని, ఆకట్టుకునేలా లేదని అభిప్రాయపడ్డారు.

# విద్యార్థుల నమోదు పెంపుదల

* **లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి**
* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, దీనికోసం నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాస్థాయిలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు జరుగుతున్న వృక్షంత్ర శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నా, ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టి విద్యను అందరికీ అందే విధంగా కృషి చేయాలన్న నాణ్యమైన విద్యను అందించడమే మార్గమని దీనికి వేరే ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా వృక్షంతర శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వచ్చే విద్యా సంవత్సరం నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదిలో వినియోగించడం, మౌలిక భాష మరియు గణిత అభివృద్ధి కార్యక్రమాన్ని కృత్రిమ మేధా ఆధారంగా అభివృద్ధి పరచటం, పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెట్టబడుతున్న కృత్రిమ మేధ పాఠ్యాంశాలను పిల్లలకు అందించడం అనే మూడు నూతన విషయాలతో ఈ కార్యక్రమం రూపొందించబడిందని దీనిని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ అందిపుచ్చుకొని ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, మౌలిక వసతులలో ఏ విధమైన అంతరాలు




ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి కి తెలియజేస్తే సాధ్యమైనంత వరకు ఏర్పాటు చేయటానికి తప్పనిసరిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులకు ఎవరూ ప్రత్యామ్నాయం కాదని ఉపాధ్యాయ సర్వశక్తిమంతులని కావున వారంతా ప్రభుత్వ విద్య పరిరక్షణకు తప్పనిసరిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ,. నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, జిల్లా రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఆంజనేయ స్వామివారికి కుమావత్ మనోహర్ నీతూ దంపతుల ప్రత్యేక పూజలు

* **రాజపేటలో హనుమాన్ భక్తులకు బిక్షా కార్యక్రమం**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఉమావత్ మనోహర్ నీతో దంపతులు వారి కుటుంబ సభ్యులు బుధవారం హనుమాన్ మాలాధారణ భక్తులకు అన్న ప్రసాద వితరణ బిక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. రాజపేటలోని వారి స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటగా మనోహర్ నీతూ దంపతులు కుటుంబ సభ్యులు బంధువులు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ మాల ధారణ స్వామిలు గొట్టిపాముల సాయికుమార్, సట్టు నాని లు పూజా కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రజలు మాలాధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ స్వామి వారి నైవేద్యాన్ని సాంప్రదాయ బద్ధంగా తీసుకొచ్చి ప్రత్యేక భజనలు, పాటలతో నైవేద్యం ప్రసాదం సమర్పించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలాధారణ భక్తులు సుమారు మూడు గంటల పాటు భక్తి గీతాలను ఆలపించారు. భజన కార్యక్రమం సందర్భంగా గ్రామమంతా ఆంజనేయ స్వామి వారి నామస్మరణలతో మార్మోగింది. మనోహర్ నీతు దంపతులు హనుమాన్ మాల ధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 300 కి పైగా హనుమాన్ మాల ధారణ, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులను శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ పక్షాన ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## యాదగిరిగుట్టలో ఘనంగా బీర్ల శంకర్ జన్మదిన వేడుకలు....



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : మాజీ తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు, యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బీర్ల శంకర్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీగా కార్ల తో ర్యాలి నిర్వహించి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ స్వామి అమ్మవార్లకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల శంకర్ ను అర్చక స్వాములు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆ తర్వాత స్వామి వారి వైకుంఠ ద్వారం పాదాల వద్ద..కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి తన అన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున్న తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు శాలువలు పూల దండలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## ఘనంగా హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ సెమినార్

శేర్లింగంపల్లి: ప్రజాస్ఫూర్తి : మహిళలు అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా ఉండాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప అరుణాచలం అన్నారు. అందుకే మహిళా అభివృద్ధి కోసం హ్యూమన్ రైట్స్ లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ సెమినార్ అల్వాల్ లోని ఇందిరా నగర్ లో జరిగిన మెగా లీగల్ సెమినార్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను సమాజంలో ఇప్పటికీ చిన్న చూపు చూస్తున్నారని ఆయన అన్నారు. సమాజంలో మహిళలు స్వేచ్ఛగా బతికే హక్కు ఉందని కానీ దానిని కొంతమంది విస్మరించి వంటింటికి పరిమితం చేస్తున్నారని ఆయన తెలిపారు. ద్వారా హ్యూమన్ రైట్స్ ద్వారా మహిళలకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయడం కోసం ఈ సెమినార్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయ్ నాగమణి తెలంగాణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ హెడ్, ఉదయ్ శంకర్ ప్రధాన కార్యదర్శి హ్యూమన్ రైట్స్ ,ఎం నరేష్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భాష తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హ్యూమన్ రైట్స్, రవి జాతీయ యాక్షన్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన 540 బస్తాల ధాన్యం రైస్ మిల్ కు తరలింపు

* **ఏఈఓ సస్పెండ్, మహిళను వ్యాపారిగా చిత్రీకరించడం పై సర్వత్ర విమర్శ**
* **పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పలువురి డిమాండ్.**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం లో జరిగిన సంఘటనపై మంగళవారం ఏఈఓ సస్పెండ్, పిఎసిఎస్ సెంటర్ ఇన్చార్జి ని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు, తాసిల్దార్ ఇంద్రాకర్ అనిత, ఎమ్మార్ఐ రమేష్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, పోలీసులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. 9 కుప్పలను కాంటావేగా 540 బస్తాలు కాగా అట్టి 216 క్వింటాల ధాన్యాన్ని రాజపేటలోని మణికంఠ పారా బాయిల్డ్ రైస్ మిల్కు ప్రత్యేక లారీలో ట్రక్ షీట్ ఏర్పాటుచేసి తరలించారు. తహసిల్దార్ ఇంద్రాకర్ అనిత రెవెన్యూ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పూర్తి వివరాలను ఆర్డిఓకు నివేదిక సమర్పించారు. కాగా ముగ్గురు వ్యాపారస్తులకు సంబంధించిన పది ధాన్యం రాశులు ఉన్నట్లు అధికారులు చెప్పగా ఆ విషయంలో అనేక పొరపాట్లు ఉన్నాయని గ్రామస్తులు రైతులు చెబుతున్నారు. మహిళా వ్యాపారి వుండంటూ గిట్టని వారు తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని వారు చెప్పారు. వృత్తిని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎంతో చక్కగా నిర్వర్తిస్తున్న ఏఈఓ ప్రణీత పై సస్పెన్షన్ వేటు అమానుషమని అధిక సంఖ్యలో రైతులు ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ధాన్యం రాశుల వివరాలను బయటపెట్టి పక్కకు పెట్టిన ఏఈఓ పై చర్యలు నిజాయితీ ఉద్యోగులను ఆశ్చర్యానికి గురి చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ఏఈఓ పై సస్పెన్షన్ వేటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్వామివారి జోడు సేవలను రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

* **బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానానికి గురువారం ప్రపంచ సుందరిమణులు వస్తున్నారని స్వామివారి యొక్క జోడు సేవలు రద్దు చేయడానికి బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరో సుందరిమణులు వస్తున్నారు అని చెప్పి స్వామివారి సేవలకు ఆటంకం కలిగించడం ఆక్షేపనీయమన్నారు. వాళ్ల కోసం దేవస్థానం నుండి ఎందుకు వృధా ఖర్చులు చేస్తున్నారు దీనిపైన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఆఫీసర్లు తక్షణం స్పందించి ఆ యొక్క సేవలను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు పెట్టుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీళ్ళని ఇలా రాష్ట్ర మొత్తం తిప్పి డబ్బులు వృధా చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రాలు అయిన హిందూ దేవాలయాల్లో ఇలాంటి సాంప్రదాయాన్ని ప్రోత్సహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు

## హనుమాన్ జయంతి వేడుకలకు హజరుకావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత కె.యం. ప్రతాప్ కు ఆహ్వానం

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోఈ నెల 22న హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించబోయే హనుమాన్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని బుధవారం హనుమాన్ భక్తమండలి సభ్యులు రంగారెడ్డి



జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ ని, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్ గౌడ్ లను ఆయన నివాసంలో కలిwసి ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో వి. హెచ్. పి. అద్వర్యములో మంగళవారం రాత్రి హనుమాన్ మలధారణ భక్తులు శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా జండాలు చేత పట్టుకొని మాలాధారణ భక్తులు గ్రామంలో ప్రధాన వీధుల గుండా హనుమాన్ నామస్మరణ భక్తి పాటలతో శోభాయాత్ర నిర్వహించగా రేణిగుంట గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా శ్రీ స్వామివారి నామస్మరణతో మార్మోగింది ఆధ్యాత్మిక శోభాను నెలకొంది. గ్రామ పెద్దలతో పాటు మహిళలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయ స్వామి వారి నమస్మరణ చేశారు. గ్రామ ప్రజల క్షేమం గ్రామ అభివృద్ధి కాంక్షిస్తూ ఈ కార్యక్రమం కొనసాగింది.

## మరణించిన తోటి స్నేహితుని కుటుంబానికి ఎస్ఎస్సి బ్యాచ్ సహాయం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం నమిల గ్రామంలో ఇటీవల మరణించిన కోకట్ల నరసింహులు కుటుంబానికి బుధవారం తోటి స్నేహితులైన ఎస్ఎస్సి 2005 2006 బ్యాచ్ తరపున 32 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మృతుడు కోకట్ల నరసింహులు స్నేహితులు నక్కిర్త కనకరాజు, నర్సింలు, శ్రీను భాస్కర్, మధు, డీలర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ 2025 అందాల భామలకు ఘన సన్మానం




యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన లో భాగంగా మిస్ వరల్డ్ 2025 బుధవారం వరంగల్ పర్యటనకు వెళ్తూ మార్గ మధ్యలో భువనగిరి బైపాస్ లో వున్న వివేర హోటల్ వి కన్వెన్షన్ లో అందాల భామలు మధ్యాహ్నం చేరుకున్నారు. వారికి తెలంగాణ రాష్ట్ర హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, వివేర హోటల్ ఎండి రాఘవేంద్ర రెడ్డి,పోలీసు ఉన్నతాధికారులు ,రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయ సందర్శనకు వెళ్తూ మార్గ మధ్య లో వివేర హోటల్ ప్రత్యేక బోజనాలు ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ లో 29 మంది అందాల భామలు హాజరయ్యారు

## పుట్టినరోజు వేడుకల్లో బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం, సోమరం గ్రామ బిజెపి శాఖ అధ్యక్షుడు పుప్పాల సతీష్ కుమారుడి పుట్టినరోజు బుధవారం జరుగగా వేడుకల్లో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు. చిన్నారిని ఆశీర్వదించారు



# అరుణోదయానికి స్వర్ణోత్సవం

## ఘనంగా 50 వ వార్షికోత్సవ వేడుకలు

* అరుణోదయ 50 వసంతాల ఆడియో సిడి ఆవిష్కరణ..
* సబికుల్ని ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
* ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జిల్లాల నుండి విచ్చేసిన ఉద్యమకారులు

(హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి) : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగిన స్ఫూర్తి సభ విజయవంతమైంది. ఇటీవల కాలంలో అకాల మరణం పొందిన సాహిత్య వేత్త,పరిశోధకుడు కామ్రేడ్ ముత్యం స్మారక హాల్ లో జరిగిన సభను నిర్వహించారు. అంతకు ముందు సుందరయ్య పార్క్ నుండి వి ఎస్ టీ వరకు వందలాది మందితో కళా ప్రదర్శన సాగింది. అరుణోదయ జెండాలు ధరించిన కళాకారులు ఎర్ర చీరలతో, దోతులుకట్టి, గొంగళ్లను భుజాన వేసుకొని చేతిలో జెండాలు పట్టుకొని, నృత్యాలు చేస్తూ, సాంప్రదాయ కళాకారులు వెంటరాగా అత్యంత ఉత్సాహంగా సాగింది. అనంతరం ఖమ్మం జిల్లాకు చెందిన అరుణోదయ సీనియర్ కళాకారుడు, అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు అరుణోదయ జెండాను ఎగరవేశాడు. అమరుల స్తూపం వద్ద కళాకారులు ఎర్రజెండాకు, అమరవీరులకు లాల్ సలాములు చెబుతూ విప్లవ గీతాలు ఆలపించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క సభకు సభాధ్యక్షురాలుగా వ్యవహరించగా కార్యక్రమానికి ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, దివి కుమార్, ఏకే ప్రభాకర్, ఎనిశెట్టి శంకర్, కొల్లాపురం విమల, భుజంగరావు, ప్రొఫెసర్ లక్ష్మి, అంబిక,అనిత,మల్సూర్,రాకేష్, జీవన్ కుమార్,కట్టా భగవంత రెడ్డి, విరసం వరలక్ష్మి, పవన్, సంతోష్, దప్పు భాస్కర్ లు తదితరులు వేదికపై నుండి సభకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా అరుణోదయ, పిడి ఎస్ యు, పి ఓ డబ్ల్యూ మూడు విప్లవ ప్రజా సంఘాలకు 50 ఏళ్లు నిండిన సందర్భంగా అరుణోదయ ఆడియో, వీడియో పాటను రూపొందించగా అంబిక పాటను ఆవిష్కరించారు. అదేవిధంగా అరుణోదయ సావనీర్ పుస్తకాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ముద్రించగా అట్టి పుస్తకాన్ని ఎనిశెట్టి శంకర్ ఆవిష్కరించారు.



### ఆకట్టుకున్న పలువురి ప్రసంగాలు

సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అరుణోదయకు ముందుగా అభినందనలు తెలిపారు. అరుణోదయ తన ఆశయసాధనలో మరింత శక్తిని పొందుకొని ముందుకు కదిలి సాగాలన్నారు. జన సాహితి అధ్యక్షులు దివి కుమార్ మాట్లాడుతూ నక్సల్బరి ఉద్యమం నుంచి శ్రీకాకుళం, గోదావరిలోయ ఉద్యమాల ప్రేరణతో అరుణోదయ సంస్థ 1974 లో ఆవిర్భవించడం జరిగిందన్నారు. సాంస్కృతిక రంగంలో జీవితకాలం కృషి చేసిన వారు ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ తరాలు ముందుకు సాగాలన్నారు. 50 ఏళ్ల సాంస్కృతిక ఉద్యమం అనేక అనుభవాలనుంచిందన్నారు. ఫాసిజంపై పోరాడాల్సినటువంటి అవసరం నేడు ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో అందరం కలిసి ముందుకు సాగాలన్నారు. మానవ హక్కుల వేదిక) జీవన్ కుమార్ మాట్లాడుతూ పాట ప్రజలది, కష్టజీవులదన్నారు. అరుణోదయ పాటను ప్రజల నుండి సేకరించిందన్నారు. అందులో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను చొప్పించి మళ్లీ ప్రజల దగ్గరకు పాట రూపంలో అరుణోదయ తీసుకెళ్లిందన్నారు. పాట సమాజాన్ని చాలా ప్రభావితం చేసిందన్నారు. రైతుల గురించి, స్త్రీల గురించి, పీడిత ప్రజల గురించి అనేక పాటలను అరుణోదయ ముందుకు తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా కొనియాడారు. అరుణోదయ తన కృషి ఇంకా ముందుకు కొనసాగించాల్సి ఉందని అన్నారు. మనమందరం సంస్థకు అండగా ఉండాలని, పాటను ప్రజల దగ్గరికి తీసుకెళ్లడానికి పరిశోధనలు జరగాలని అన్నారు. ప్రొఫెసర్ కొండా నాగేశ్వరావు మాట్లాడుతూ 50 ఏళ్ల కాలంలో అరుణోదయ ప్రజల పక్షాన పోరాటం చేసిందన్నారు. ఈ క్రమంలో అనేక అడ్డంకులు,నిర్బంధాలను ఎదుర్కొన్నదన్నారు. ప్రజా ఉద్యమాలలో అరుణోదయ ఉందన్నారు. అరుణోదయ తన మాటను, పాటను ప్రజలకు అంకితం చేసిందన్నారు. అరుణోదయ ప్రజా సాంస్కృతి ఉద్యమాన్ని తన భుజాలపై మోసి ఉపా కేసులను ఎదుర్కొందన్నారు. పాలకులు కగార్ పేరు మీద ప్రజల పైన యుద్ధం చేయడం సరైనది కాదన్నారు. అంటరానితనం, కుల నిర్మూలన పోరాటాలు, బహుజన బతుకమ్మ బతుకమ్మ లాంటి ఎన్నో కార్యక్రమాలను అరుణోదయ ముందుకు తీసుకొని వెళ్ళింది అన్నారు. పాట ద్వారానే రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంశాలను ప్రజలకు సులభంగా అర్థం చేయించగలరని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కృషిని విమలక్క బలంగా చేస్తుందని తన అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు. సాంస్కృతిక ఉద్యమంలో ప్రజల కోసం ప్రాణాలర్పించిన కళాకారులు ఎందరో ఉన్నారని వారందరికీ జోహార్లు అర్పించారు. నేడు పాటలపై, మాటలపై నిర్బంధం కొనసాగుతుందన్నారు. 50 ఏళ్ల ప్రస్థానం చిన్న విషయం కాదన్నారు. ఎన్నో ఆలోచనలు, అనుభవాలను, ఆటంకాలను, దాడులను సమీక్షించుకొని మరింత శక్తితో ప్రజల కలలు నెరవేర్చేందుకై ముందుకు సాగాలని, దోపిడీ, పీడనలను ఎదిరించడానికి ప్రజా సంస్కృతిని నిర్మాణాన్ని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఎనిశెట్టి శంకర్ మాట్లాడుతూ 1970 దశకంలో ఏర్పడిన అరుణోదయ సమాజంలో ఉన్న దోపిడీ, పీడలకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. అరుణోదయ పీడతుల పక్షాన నిలబడిందన్నారు. కుల పోరాటాలు,పర్యావరణ, బహుజన బతుకమ్మ, స్త్రీల సమస్యలను అరుణోదయ ప్రజల్లోకి తీసుకెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో.. రమేష్ పోతుల, ఏపూరి మల్సూర్, రాకేష్, అనిత( అరుణోదయ), ప్రొఫెసర్ కాసిం సార్, మోత్కూరు శ్రీనివాస్, అరుణ పి ఓ బి (స్త్రీ విముక్తి ), పట్లోళ్ల నాగిరెడ్డి ఆర్ సి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, సుజ్ఞానమ్మ, సుధాకర్ ఏ పి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాము పవర్ (ముంబాయి ), బిఎస్ రాములు, ప్రొఫెసర్ లక్ష్మి, కాకి భాస్కర్, విరసం వరలక్ష్మి, జిలుకర శ్రీనివాస్, ఓయూ జేఏసీ నేత దరువు అంజన్న,కోలార్ శాంతమ్మ( కర్ణాటక), రాయలసీమ కళావేదిక వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





## సీఎం సహాయ నిధి నిరు పేద ప్రజల పాలిట వరం

* మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సీఎం సహాయ నిధి నిరు పేద ప్రజల పాలిట వరమని సుభాష్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీకి చెందిన చిన్నారి డి. వశిష్ట (15) అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ చిన్నారి అనారోగ్య సమస్యపై చలించి వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.1.10 లక్షల విలువ గల ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించారు. అట్టి చెక్కును బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎల్ఓసి చెక్కును అందజేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ఆరోగ్యభద్రతకు తోడ్పాటునిస్తుందన్నారు. పేద ప్రజల ఆత్మబంధువు మా నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని అన్నారు. అనారోగ్య సమస్యతో బాధపడుతూ మెరుగైన చికిత్సకై ఎదురుచూస్తున్న ప్రతి ఒక్క నిరుపేద లబ్ధిదారుడు ఈ ఎల్ఓసి సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, శేషా చారి, అనిల్ కుమార్, విజయ్ కుమార్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా చదివితే అద్భుతాలు సృష్టించవచ్చు

* టీవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ టీ. కోటి రెడ్డి

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పట్టుదలతో , దృఢ సంకల్పంతో ప్రణాళికాబద్ధంగా చదివితే అద్భుతాలు సృష్టించ వచ్చునని టీవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ టీ. కోటి రెడ్డి అన్నారు. సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలలో ఎస్ఆర్ నాయక్ నగర్ లోని టీవిఆర్, సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విజయఢంకా మ్రోగించారు. ఈ సందర్భంగా ఆయన తో పాటు మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి , అధ్యాపక బృందం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం టి.కోటిరెడ్డి మాట్లాడుతూ 64 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాశారని, మొత్తం 500 మార్కులకు గాను శౌర్య తివారి అనే విద్యార్థి( 468) మార్కులు సాధించి విజేతగా నిలిచారు. పీ. త్రిశాంక్ రెడ్డి (466), ఎం. గౌతమ్ కుమార్ రెడ్డి (462), శ్యామ్ నక్రాణి (451), కె. మేఘన (440), పి. నిదీషా (431), బి. నందిత (424) , ఎస్. సామ్యూల్ (415), సైదు భాను శ్రీ (411), ఎల్. అఖిల్ (410), టి. తనుషా శ్రీ (408), పీ.విటల్ గౌడ్ (407), మయాంక్ కుమార్( 407) మొత్తం 13 మంది 400 పైగా విద్యార్థినీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మరొకసారి టీవిఆర్ సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ కీర్తిని చాటారన్నారు. సమయం చాలా విలువైనది కనుక కాలయాపన కు ఎక్కడ చోటు ఇవ్వకుండ క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు చేరి మీ జీవితానికి బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని హితవు పలికారు. నేటి నుండి 5 సంవత్సరాలు ఇంటర్ డిగ్రీ/ ఇంజనీరింగ్ వరకు కష్టపడి చదివితే మీకు ఇష్టమైన భవిష్యత్తు మీ కళ్ళ ముందు ఉంటుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుండి మార్చి 3వ తేది వరకు జరిగిన సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షలలో టీవిఆర్ అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి పటిష్ట ప్రణాళికలతో టీవిఆర్ సత్యవాణి హై స్కూల్ 100% ఫలితాలను సాధించినది అని తెలియజేశారు

# కర్రెగుట్ట ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి

**: డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం**

చర్ల: తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సీఆర్పిఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం తెలిపారు. బుధవారం బీజాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ జరిగిన 21 రోజుల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 16 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో మృతి చెందిన మావోయిస్టులపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. 18 మంది జవాన్లు గాయపడినట్లు చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల్లో 20 మందిని గుర్తించామని, ఇంకా 11 మందిని




గుర్తించాల్సి ఉందన్నారు. 31 మంది మావోయిస్టుల నుంచి 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు కర్రెగుట్ట ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఈఏడాది మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిగిన ఆపరేషన్‌లో 174 మంది హార్డ్ కోర్ మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

## ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉంది

*** మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన రాక్షల్కర్ స్వప్న రూ.15000లు,తమ్మాలి నర్సింహా రూ.60,000లు, మహేష్‌గౌడ్ రూ.60,000/ల చెక్కులను బుధవారం షాపూర్ నగర్ లోని మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం సహాయనిధి నిరుపేదలకు వరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో వచ్చిన నియోజకవర్గం ప్రజలను కలిసి ఆహ్వానాలు,వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళ సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే 'గ్రూప్స్' ఉద్యోగ నియామకాలు

## : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.

"ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే ఏపీలో భారీ ప్రాజెక్టులకు నెహ్రూ శంకుస్థాపన చేశారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే మనకు నీళ్లు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 50, 60 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి మనకు నీళ్లు ఇస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లలోనే కూలింది. కట్టిన మూడేళ్లలోనే కూలిన ప్రాజెక్టు ప్రపంచంలో మరెక్కడా లేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు. కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది" అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను



మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తామన్నారు. గ్రూప్ 1 నియామకాలు అడ్డుకోవడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. త్వరలోనే గ్రూప్స్ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలి

**: సీబీఐ కోర్టులో గాలి జనార్దనరెడ్డి పిటిషన్**

హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో అరెస్టయి జైలులో ఉన్న గాలి జనార్దనరెడ్డి నాంపల్లిలోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంచల్‌గూడ జైలులో తనకు అదనపు సౌకర్యాలు కల్పించాలని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. ఓబుళాపురం మైనింగ్ కేసులో



గాలి జనార్దనరెడ్డికి సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే.

## కాల్పుల విరమణలో

## మూడో దేశం మధ్యవర్తిత్వం అనవసరం

**: ఎంఏ బేబీ**

హైదరాబాద్: ఉగ్రవాదాన్ని అణచివేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత్‌పాక్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. భారత్‌పాక్‌ల మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అనవసరమన్నారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించాలన్నారు.




*** ఆపరేషన్ కగార్ ఆపడం శుభపరిణామం: బీవీ రాఘవులు**

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయడం శుభపరిణామమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని కోరారు.

*** ఎన్నికల ముందు రేవంత్‌కు తెలియదా?: జాన్ వెస్లీ**

ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి సీఎం రేవంత్ రెడ్డికి తెలియదా? అని సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రేవంత్ రెడ్డి మాట మార్చుతున్నారన్నారు. హామీలు అమలు చేయకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు.

## వరంగల్‌లో పేదల ఇళ్లు ఎందుకు కూల్చుతున్నారు?

## : కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్: వరంగల్‌లో కూల్చివేతలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బుల్డోజర్ కంపెనీలతో ప్రభుత్వం రహస్య ఒప్పందం చేసుకుందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇళ్లు, దుకాణాలను ఎందుకు కూల్చుతున్నారని.. వారి జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేస్తున్నారని ఆయన నిలదీశారు.

## మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు మరో కీలక బాధ్యత

పార్లమెంట్ కమిటీల్లో మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు మరో కీలక బాధ్యత దక్కింది. కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్లేషన్‌లో ఆయనను సభ్యుడిగా నియమిస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చైర్ పర్సన్‌గా బాలశౌరి వల్లభనేని ఉన్నారు. అంతే కాకుండా రఘునందన్ రావుతో పాటూ సభ్యులుగా పి.చిదంబరం, సతీష్‌కుమార్ గౌతమ్, మొహమ్మద్ జావిద్, సంబాజీ



రావు మానె, మహువా మోయిత్రా, ప్రేమ చంద్రన్, శ్రీరాజీవ్ రాయ్, ఏ.రాజా, అలోక్ కుమార్ సుమన్, వివేక్ ఠాకూర్, రాజేశ్ వర్మలను సభ్యులుగా నియమించారు. రఘునందన్ రావు ఇప్పటికే పర్సనల్ పబ్లిక్ గ్రీవెన్సెస్, లా అండ్ జస్టిస్ స్టాండింగ్ కమిటీ మిరియు కన్సల్టేటివ్ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు మరో కీలక బాధ్యత దక్కడంతో అభిమానులు, పార్టీ శ్రేణులు ఖుషీ అవుతున్నారు.

## ఆ రైతులను ఆదుకుంటాం : మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఓ శుభవార్త వినిపించింది. రాష్ట్రంలో కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు బుధవారం ప్రకటించారు. పంటలు నష్టపోయిన, దెబ్బతిన్న రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.




## సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సరస్వతి పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను నడిపించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్‌తో పాటు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని గ్రేటర్ జోన్ఈడీ రాజశేఖర్‌తెలిపారు. ఈ నెల 14 నుంచి సరస్వతి పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను నడిపించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. 24వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. 40 మంది కలిసి పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారి కాలనీలకే ప్రత్యేక బస్సులను పంపేలా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tgsrtcbus.in వెబ్ సైట్‌ని సంప్రదించాలని సూచించారు. ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# నౌకలో 21 మంది పాక్ సిబ్బంది.. ఆ పోర్టులో హైఅలర్ట్!

భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఓడరేవుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఒడిశాలోని పరదీప్ పోర్టుకు వచ్చిన ఓ షిప్ కలకలం రేపింది. అందులో 21 మంది పాకిస్థాన్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడమే అందుకు కారణం. దీంతో ఆ పోర్టులో భద్రతను పెంచారు. ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పరదీప్ పోర్టుకు చేరింది. 'ఎమ్‌టీ సైరెన్ II' పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఇది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం ముడి చమురును తీసుకొచ్చింది. తనిఖీలు చేపట్టగా సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీయులుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి దీనిగురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది



అప్రమత్తమయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కి.మీ. దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడి చమురు అన్‌లోడింగ్ పూర్తయ్యే వరకూ 25 మంది సిబ్బంది నౌకను వీడకుండా భద్రతా ఏర్పాట్లుచేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## ఆ మంత్రిపై కేసు నమోదు చేయండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకంగా వ్యవహరించిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ పై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంలో ఆయనపై కేసు నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ నాలుగు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం. ఓ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా మాట్లాడుతూ.. సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ పేరును పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేస్తే.. వాళ్ల (ఉగ్రవాదుల)



మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో మోదీజీ పంపించి గుణపాఠం నేర్పించారని అన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు స్త్రీల పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది.

## తుర్కియే యూనివర్సిటీతో ఒప్పందాన్ని నిలిపేసిన జేఎన్‌యూ...

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియేపై మన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో మన ట్రావెల్ ఏజెన్సీలు తుర్కియేకు ఆన్‌లైన్ బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. ఇదే తరహాలో తుర్కియేలోని ఇనొను యూనివర్సిటీతో కుదుర్చుకున్న ఒప్పందం (ఎంవోయూ) ను నిలిపేస్తున్నట్లు దిల్లీలోని ప్రఖ్యాత జేఎన్‌యూ తాజాగా ప్రకటించింది. ఇరుదేశాల యూనివర్సిటీల మధ్య ఇటీవల మూడేళ్లకు గాను విద్యాపరమైన ఒప్పందం కుదరగా.. తాజా పరిణామాల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేస్తూ జేఎన్‌యూ నిర్ణయం తీసుకుంది. కాగా.. దేశ భద్రత దృష్ట్యా ఇనొను యూనివర్సిటీతో కుదుర్చుకున్న ఎంవోయూను ప్రస్తుతం నిలిపేస్తున్నట్లు జేఎన్‌యూ సీనియర్ అధికారి తెలిపారు. "గతంలో తుర్కియే ఇనొను యూనివర్సిటీతో కుదుర్చుకున్న ఎంవోయూను నిలిపేస్తున్నాం. ఈ ఒప్పం



దంలో అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడికి సంబంధించిన ప్రణాళికలు ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఇనొను యూనివర్సిటీ తుర్కియేలోని మలట్యాలో ఉంది. విభిన్న సాంస్కృతిక పరిశోధనలు, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా ఇటీవల జేఎన్‌యూ, ఇనొను యూనివర్సిటీల మధ్య ఎంవోయూ కుదిరింది. అయితే భారత్ పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో తుర్కియే పాక్‌కు అనుకూలంగా వ్యవహరించింది. దీంతో 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా తుర్కియే వస్తువులు, పర్యాటకాన్ని బహిష్కరించాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో మన ట్రావెల్ ఏజెన్సీలు కూడా తుర్కియేకు ఆన్‌లైన్ బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. రానున్న రోజుల్లో తుర్కియేతో భారత వాణిజ్య సంబంధాలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పాక్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మిస్తాం.. జమ్ముకశ్మీర్ సీఎం



శ్రీనగర్: నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ బలగాలు జరిపిన షెల్లింగ్‌లో ధ్వంసమైన ఇళ్లను జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరిశీలించారు. నష్టానికి సంబంధించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడానికి అవసరమైన సాయాన్ని ప్రభుత్వం తరపు నుంచి అందిస్తామని ఈ సందర్భంగా బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. వారి బాధను తాను అర్థం చేసుకోగలనని అన్నారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని సలామాబాద్, లాగామా, బందీ, గింగల్ సహా ఉరీలోని షెల్లింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ఒమర్ అబ్దుల్లా పర్యటించారు. ఈ ప్రాంతాల్లో వ్యక్తిగత బంకర్లను నిర్మించాలనే డిమాండ్‌ను కేంద్రంతో చర్చిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పునర్‌నిర్మించుకోవడానికి ప్రజలకు సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఉరీ ప్రాంతంలోని ప్రజలు అనేకసార్లు బాధను భరించారని.. అయితే, ప్రతిసారి ఎంతో ధైర్యంతో తిరిగి కోలుకున్నారని అబ్దుల్లా అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ దళాలు సరిహద్దుల్లోని ప్రజలకు ఎక్కువ హాని తలపెట్టాలనే ఉద్దేశంతోనే దాడులు చేశాయని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాలు రెండు రోజులుగా నిశ్శబ్దంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేస్తున్నామని.. బాధితులందరికీ సాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## సింధూ జలాలపై పునఃసమీక్షించండి.. భారత్‌కు పాకిస్థాన్ విజ్ఞప్తి

దిల్లీ: సింధూ జలాల ఒప్పందం నిలిపివేత వల్ల జరిగే నష్టం ఏంటో పాకిస్థాన్‌కు తెలుసొచ్చింది. మొన్నటి వరకు ఈ అంశంలో తీవ్ర స్వరంతో మాట్లాడిన దాయాది ఇప్పుడు ఆత్మరక్షణలో పడినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణకు అంగీకరించిన భారత్.. సింధూ జలాల విషయంలో వెనక్కి 'తగ్గేదే లే' అని ప్రకటించడంతో ఇప్పుడు కాళ్ల బేరానికి వచ్చింది. నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలంటూ కోరింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూ జలాలు నిలిపివేస్తే పాక్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖ రాసినట్లు సమాచారం. ఈ విషయంలో చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ ఇప్పటికే



స్పష్టంచేశారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే అని పేర్కొన్నారు.

### ఏమిటీ ఒప్పందం..?

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి అనంతరం సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ డీల్ ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్ కు హక్కులు లభించాయి. సింధూ నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది.

## మన భార్గవాస్త్రం సిద్ధం.. శత్రు డ్రోన్ల దండుకు గండం..!




సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో తేలికగా అందుబాటులో ఉంటున్న డ్రోన్లు.. దేశ భద్రతకు సవాళ్లుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో పాక్ మన దేశంపైకి భారీ ఎత్తున డ్రోన్లతో దాడులు చేయగా.. మన దళాలు సమర్థంగా వాటిని అడ్డుకున్నాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి ముప్పులు ఎదురైతే డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసేలా ఓ సరికొత్త వ్యవస్థ సిద్ధమైంది. స్వదేశీ పరిజ్ఞానంతో తక్కువ ఖర్చులోనే కౌంటర్ డ్రోన్ వ్యవస్థను 'భార్గవాస్త్ర'ను అభివృద్ధి చేసింది సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ. తాజాగా ఈ అస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని గోపాల్‌పుర్‌లో గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో 'భార్గవాస్త్ర' మైక్రో రాకెట్ వ్యవస్థను పరీక్షించగా.. అన్ని లక్ష్యాలను విజయవంతగా ఛేదించినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దీనికి మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించారు. రెండు ట్రయల్స్‌లో ఒక్కో రాకెట్ చొప్పున పెట్టి పరీక్షించారు. మూడో దశలో రెండు రాకెట్లను ఒకేసారి 2 సెకన్ల వ్యవధిలో పేల్చి లక్ష్యాన్ని ఛేదించారు.

## అణ్వస్త్ర బెదిరింపులకు వ్యతిరేకం: కేంద్రమంత్రి

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై భారత్ ఇప్పటికే దౌత్య చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దాయాదిపై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేంద్రం పలు దేశాల రాయబారులు, విదేశాంగమంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆపరేషన్ సిందూర్‌పై ఆస్ట్రియా విదేశాంగశాఖ మంత్రి బీట్ మెయిన్ల్ రైసింగర్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడుల గురించి మాట్లాడుతూ..ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి, అణ్వస్త్ర



బెదిరింపులకు వ్యతిరేకమనే అంశాలపై ఇరువురు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు జైశంకర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం గురించీ తాము చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే మంగళవారం జైశంకర్ ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తోనూ ఫోన్‌లో మాట్లాడారు. భారత్ ఉగ్రవాదాన్ని ఏ మాత్రం సహించదని వారికి తెలియజేశారు. ఇతర ప్రపంచ దేశాల ప్రతినిధులతో చర్చించారు. పాక్‌పై మిలిటరీ చర్యకు కారణాలు చెప్పి.. మద్దతు కొనసాగించాలని కోరారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌పై భారత్ చేపట్టిన చర్యల గురించి చైనా, అమెరికా, జపాన్, జర్మనీ, యూకే, రష్యా వంటి 70 దేశాల దౌత్యాధికారులకు భారత్ వివరించింది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్ వేసిన ముందడుగు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాల వివరాలను వారికి తెలియజేసింది.

### స్వల్ప లాభాల్లో ముగిసిన

# స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో పాటు మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,278.49 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 80,910.03 పాయింట్ల కనిష్టానికి పడిపోయిన సెన్సెక్స్ ఆ తర్వాత కోలుకుంది. ఈ క్రమంలో 81,691.87 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది.

దాదాపు 2,749 షేర్లు లాభపడగా.. 1,085 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్, ఎటర్నల్ ప్రధానంగా లాభాలను ఆర్జించాయి. ఏషియన్ పెయింట్స్, సిప్లా, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పెరిగాయి. బ్యాంకు మినహా మిగతా రంగాల సూచీలన్నీ రియాల్టీ, చమురు, గ్యాస్, టెలికాం, మీడియా, ఐటీ, మెటల్ సూచీలు 1-2.5 శాతం పెరిగాయి.

# ఉద్యోగులకు షాకిచ్చిన మైక్రోసాఫ్ట్

**వేలాది మందిపై వేటు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. వేలాది మందిని తొలగించేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ నిర్ణయంతో దాదాపు 6 వేల మందిపై లేఆఫ్స్ ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది.

గతేడాది జూన్ నాటికి ఆ సంస్థలో 2.28 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. మైక్రోసాఫ్ట్ తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని అంచనా. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌లకు ఉద్యోగుల పనితీరుకు సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది.

# మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్

**త్వరలో లాంచ్ కాబోతున్న ఈవీ కార్లు**



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ వాహనాల విభాగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థలన్నీ ఐసీఈ నుంచి నుండి ఈవీ వాహనాలవైపు వేగంగా మారుతున్నారు. కియా, మహీంద్రా, మారుతి సుజుకి, టాటా ఎంజీ వంటి కంపెనీలు కొత్త కార్లను లాంచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రిలీజవ్వబోయే ఈవీ వార్ల గురించి తెలుసుకుందాం.

### కియా క్లావిస్ ఈవీ

కియా క్లావిస్ ఈవీ త్వరలో లాంచ్ కానుంది. కియా కంపెనీ ఇప్పటికే ఈ మోడల్ ఇంధన వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడల్‌లో భవిష్యత్‌లో ఈవీ వెర్షన్ లాంచ్ కానుందని నిపుణులు చెబుతన్నారు. ఈ మోడల్ హాట్ సెల్లింగ్ ఉత్పత్తిగా ఉంది. క్రెటా ఎలక్ట్రిక్ నుండి చాలా కీలకమైన హార్డ్‌వేర్‌ను తీసుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి మోడల్ రెండు బ్యాటరీ కాన్ఫిగరేషన్‌లలో అందించే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు.

### ఎంజీ ఎం9

భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎం9ని భారత మార్కెట్‌కు త్వరలో తీసుకురానుంది. ఎంజీ ప్రీమియం శ్రేణిలో ఉన్న ఈ కారు 90 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ కారును ఓ సారి ఛార్జ్ చేస్తే దాదాపు 430 కి.మీ. మైలేజ్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

### మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ

మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్ఓ కారును ఈవీ వెర్షనలో త్వరలో లాంచ్ చేయనుంది. ఈ కారు 2025 చివర్లో మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లాంచ్ గురించి కంపెనీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అధికారికంగా లాంచ్ అయిన తర్వాత, ఈ మోడల్ టాటా పంచ్ ఈవీకు నేరుగా పోటీగా ఉంటుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### టాటా హారియర్ ఈవీ

2025 బీఎంజీఈ సమయంలో టాటా కంపెనీ హారియర్ ఈవీను ప్రదర్శించింది. టాటా కంపెనీ ఈ కారుకు సంబంధించిన అన్ని పరీక్షలను దాదాపు పూర్తి చేసిందని, త్వరలోనే హారియర్ ఈవీ మార్కెట్‌ను పలుకరించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 ముగిసేలోపు ఈ కారు మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది.

# రోహిత్ శర్మను అభినందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్





**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబయిలోని తన అధికారిక నివాసం 'వర్ష'లో రోహిత్ శర్మను అభినందించారు. ఇటీవల రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఫడ్నవీస్ అభినందనలు తెలుపుతూ.. భారత క్రికెట్‌కు చేసిన సేవలను ప్రశంసించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఫడ్నవీస్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రోహిత్ ఇటీవల టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. గత సంవత్సరం టీ20 ప్రపంచ కప్‌లో టైటిల్ గెలిచిన తర్వాత రోహిత్ టీ20 ఇంటర్నేషనల్ నుంచి కూడా రిటైర్ అయ్యాడు. ఇకపై కేవలం వన్డేల్లో మాత్రం కొనసాగనున్నాడు. మే 7న టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు రోహిత్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా రోహిత్ వెల్లడించారు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

రోహిత్‌ను కలిసిన ఫొటోలను షేర్ చేస్తూ ఫడ్నవీస్.. 'భారత క్రికెటర్ రోహిత్ శర్మకు స్వాగతం. రోహిత్‌ను కలిసి మాట్లాడడం చాలా బాగుంది. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం.. భవిష్యత్‌లో విజయం సాధించేందుకు శుభాకాంక్షలు తెలిపాను' అంటూ పేర్కొన్నారు. రోహిత్ శర్మ 67 టెస్టుల్లో 40.57 సగటుతో 4,301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2024-25 సీజన్‌లో రోహిత్ ఫామ్ లేమితో ఇబ్బందులుపడ్డాడు. ఈ సీజన్‌లో 15 మ్యాచ్‌ల్లో 10.83 సగటుతో 164 పరుగులు మాత్రమే చేయగలిగాడు. బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో రోహిత్ పేలవమైన ఫామ్‌లో తడబడ్డాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా వేదికగా జరిగిన మూడు టెస్టుల్లోనూ విఫలమైన విషయం తెలిసిందే.

# భారత్‌లో వరల్డ్ కప్.. ఐఎల్‌టీ20 షెడ్యూల్ మార్పు




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ జూన్ 3న ముగియనున్న నేపథ్యంలో మరో పొట్టి క్రికెట్ యుద్ధానికి తెరలేవనుంది. డిసెంబర్ 2న ఇంటర్నేషనల్ టీ20 నాలుగో సీజన్ షురూ కానుంది. అయితే.. ఆనవాయితీ ప్రకారం ప్రతిసారి జనవరి-ఫిబ్రవరి మధ్యలో టోర్నీ జరిగేది. కానీ, ఈసారి టీ20 వరల్డ్ కప్ ఉన్నందున షెడ్యూల్‌ను మార్చాల్సి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

డిసెంబర్ 2న యునైటెట్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ దినోత్సవం. యావత్ అరబ్ ప్రజానీకానికి పండుగ రోజైన ఆ తేదీని పునస్కరించుకొని లీగ్‌ను ప్రారంభించనున్నట్టు బుధవారం ఐఎల్‌టీ20 ఛైర్మన్ వెల్లడించాడు. 'వచ్చే ఏడాది ఆరంభంలో టీ20 వరల్డ్ కప్ ఉంది. అందుకే ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ షెడ్యూల్‌ను ముందుకు మార్చాం.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ దినోత్సవమైన డిసెంబర్ 2న ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. అరబ్ క్యాలెండర్‌లో ఇవి మాకు చాలా ముఖ్యమైన రోజులు. వచ్చే ఏడాది జనవరి 4 వరకూ లీగ్ జరుగనుంది' అని ఐఎల్‌టీ ఛైర్మన్ డేవిడ్ వైట్ వివరించాడు. వచ్చే ఏడాది జరుగనున్న పురుషుల టీ20 వరల్డ్ కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న విషయం తెలిసిందే.

### మూడు సీజన్లలో..

గత సీజన్‌లో దుబాయ్ క్యాపిటల్స్ విజేతగా నిలిచింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో డెజర్ట్ వైపర్స్‌ను ఓడించి ట్రోఫీని కొల్లగొట్టింది. ఆరంభ ఎడిషన్ 2023లో గల్ఫ్ జెయింట్స్ ఛాంపియన్‌గా అవతరించింది. రెండో సీజన్‌లో ఆద్యంతం అదరగొట్టిన ఎంఐ ఎమిరేట్స్ టైటిల్‌ను ముద్దాడింది.

# సఫారీ ఆటగాళ్లకు డెడ్‌లైన్.. ఐపీఎల్ మధ్యలోనే స్వదేశానికి..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18 సీజన్ తదుపరి మ్యాచ్‌లు మరో మూడు రోజుల్లో మొదలు కానున్నాయి. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లు విదేశీ ఆటగాళ్ల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెట్ తమ ప్లేయర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణాఫ్రికా బోర్డు సైతం ఐపీఎల్ తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు తమ క్రికెటర్లకు అనుమతి ఇవ్వనుంది. అయితే.. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల కంటే ముందే స్వదేశం రావాలనే షరుతు పెట్టింది సఫారీ బోర్డు. జూన్‌లో ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఉండడమే అందుకు కారణం.

'మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 25న ఐపీఎల్ ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ, భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా వారం పాటు టోర్నీ వాయిదా పడడంతో ఫైనల్ తేదీ జూన్ 3కి మారింది. అయితే, ముందస్తు ఒప్పందం ప్రకారం మే 25 వరకే మా ఆటగాళ్లు ఐపీఎల్ ఆడుతారు. మే 26న స్వదేశం బయల్దేరుతారు. ఆ తర్వాత 30వ తేదీన లండన్ చేరుకుంటారు. ఇందులో ఏ మార్పు లేదు' అని దక్షిణాఫ్రికా క్రికెట్, హెడ్‌కోచ్ శుక్రి కొన్రాడ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం 18వ సీజన్ ఐపీఎల్‌లో 20 మంది దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఆడుతున్నారు. వీళ్లలో 8 మంది డబ్ల్యూటీసీ ఫైనల్ స్క్వాడ్‌కు ఎంపికయ్యారు. ఈ ఎనిమిది మంది ఫిట్‌గా ఉండడం, మ్యాచ్‌కు కొన్ని రోజుల ముందు నుంచే అందుబాటులో ఉండడం చాలా ముఖ్యం. అందుకే ఆ దేశ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు అల్టిమేటం జారీ చేసింది. మే 26న ఎట్టి పరిస్థితుల్లోనూ స్క్వాడ్‌తో కలవాలని ఆదేశించింది. దాంతో, పలు జట్లకు ఆడుతున్న సఫారీ ప్లేయర్లు మే 25తో ఐపీఎల్‌కు దూరం కానున్నారు.

పద్దెనిమిదో సీజన్ ఆడుతున్న సఫారీ ఆటగాళ్లలో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఎంపికైంది ఎవరంటే.. కార్బిన్ బాష్, రియాన్ రికెల్టన్ (ముంబై ఇండియన్స్), వియాన్ మల్డర్(సన్‌రైజర్స్ హైదరాబాద్), మార్కో యాన్సెన్(పంజాబ్ కింగ్స్), ఎడెన్ మర్క్‌రమ్(లక్నో సూపర్ జెయింట్స్), లుంగి ఎంగిడి(ఆర్సీబీ), కగిసో రబడ(గుజరాత్ టైటాన్స్), ట్రిస్టన్ స్టబ్స్(ఢిల్లీ క్యాపిటల్స్). వీళ్లు కాకుండా డూప్లెసిస్, కుర్రాడు డెవాల్డ్ బ్రెవిస్, కొయెట్జీ, డేవిడ్ మిల్లర్, నంద్రె బర్గర్, క్వింటన్ డికాక్, హెన్రిచ్ క్లాసెన్, క్వెనా మఫాకా.. 18వ సీజన్‌లో ఆడుతున్న విషయం తెలిసిందే.

# టెస్టు హీరోకు ఐసీసీ అవార్డు

**విజేతగా స్కాట్లాండ్ కెప్టెన్..!**



**స్కాట్లాండ్:** ప్రతిష్ఠాత్మక ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులను యువ క్రికెటర్లు గెలుచుకున్నారు. ఏప్రిల్ నెలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్ అవార్డుకు ఎంపికయ్యాడు. తద్వారా ఈ మెడల్ సాధించిన మూడో బంగ్లాదేశ్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడీ యంగ్‌స్టర్. మహిళల విభాగంలో స్కాట్లాండ్ కెప్టెన్ క్యాథరీన్ బ్రైసె విజేతగా నిలిచిందని ఐసీసీ బుధవారం వెల్లడించింది.

స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన టెస్టు సిరీస్‌లో మిరాజ్ ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్నాడు. తొలి టెస్టులో అనూహ్య ఓటమి నుంచి తేరుకొని.. పర్యాటక జట్టును మట్టికరిపించడంలో మిరాజ్ కీలక పాత్ర పోషించాడు. విధ్వంసక సెంచరీకి తోడు 5 వికెట్లు తీసినందుకు ప్లేయర్ ఆఫ్ ది మంత్ వఅవార్డు రేసులో నిలిచాడు. పేసర్ బ్లెస్సింగ్ ముజరబని(జింబాబ్వే), న్యూజిలాండ్ ఆటగాడు బెన్ సియర్స్‌ల కంటే అత్యధిక ఓట్లతో విజేతగా నిలిచాడు.

మిరాజ్ కంటే ముందు బంగ్లా ఆటగాళ్లలో షకీబుల్ హసన్, ముష్ఫికర్ రహీంలు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకున్నారు. 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది. ఏ క్రికెటర్‌కు అయినా ఐసీసీ అవార్డు గుర్తింపునిస్తుంది. ఓటింగ్ ఆధారంగా నాకు ఈ మెడల్ రావడం నాకెంతో సంతృప్తిని ఇస్తోంది' అని మిరాజ్ సంబురంగా చెప్పాడు. మహిళల విభాగంలో స్కాట్లాండ్ కెప్టెన్ క్యాథరిన్ బ్రసె అవార్డుకు ఎంపికైంది. మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2025లో బ్యాటుతో, బంతితో రాణించింది. తమ జట్టు తరఫున అత్యధిక పరుగులు సాధించింది. క్యాథరీన్ 5 ఇన్నింగ్స్‌ల్లో 73.25 సగటుతో 293 రన్స్ చేసింది. 'ఐసీసీ అవార్డు గెలుపొందడం చాలా సంతోషంగా ఉంది. ఇది నాకెంతో ప్రత్యేకం. ఉత్తమ క్రికెటర్లు అయిన ఫాతిమా సనా, హేలీ మాథ్యూస్‌లను వెనక్కి నెట్టి ఈ అవార్డు అందుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది' అని క్యాథరిన్ తెలిపింది.

## యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'వర్జిన్ బాయ్స్'

**టాకీస్:** ఫ్యామిలీతో చూసే సినిమాలు కొన్ని ఉంటే... స్నేహితులతో కలిసి చూసే ఫిలిమ్స్ కొన్ని ఉంటాయి. యూత్ చూసే మూవీస్ కొన్ని ఉంటాయి. 'వర్జిన్ బాయ్స్' అయితే యూత్ చూసే సినిమా అని చెప్పాలి. గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'వర్జిన్ బాయ్స్'. ఇందులో శ్రీహాన్, రోనీత్, జెన్నిఫర్, అన్షులా, సుజిత్ కుమార్, అభిలాష్ ఇతర ప్రధాన తారాగణం. ఇదొక యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ. ఈ సినిమాకు దయానంద్ దర్శకత్వం వహించారు. రాజ్ గురు ఫిల్మ్స్




పతాకం మీద రాజా దరపునేని ప్రొడ్యూస్ చేశారు. ఈ మూవీ టీజర్ తాజాగా రిలీజ్ అయ్యింది. అవుట్ అండ్ అవుట్ యూత్ ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'వర్జిన్ బాయ్స్'ను తీసినట్టు టీజర్ చూస్తుంటే అర్థం అవుతోంది. రొమాన్స్ అండ్ అడల్ట్ కామెడీని గట్టిగా దట్టించారు. స్మరణ్ సాయి సంగీతం టీజర్‌లో జోష్ పెంచగా... వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. గీతానంద్, మిత్రా శర్మ మధ్య కెమిస్ట్రీ యూత్ ఆడియన్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మోడ్రన్, న్యూ ఏజ్ కాలేజీ లైఫ్ - యూత్ లైఫ్ స్టైల్ చూపించే సినిమా అని అర్థం అవుతోంది. 'బిగ్ బాస్' ఫేమ్ శ్రీహాన్ క్యారెక్టర్ - కామెడీ టైమింగ్ జనాలకు నచ్చేలా ఉంది. వేసవిలో 'వర్జిన్ బాయ్స్'ను థియేటర్లలోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'వర్జిన్ బాయ్స్' నిర్మాత రాజా దరపునేని మాట్లాడుతూ... "యూత్ అందరికీ కనెక్ట్ అయ్యేలా మా సినిమాను తీర్చిదిద్దాం. గతంలో వచ్చిన యూత్ ఫుల్ సినిమాలకు భిన్నంగా కొత్త కథతో ఈ సినిమా తీశాం. రొటీన్ మూవీ అన్నట్టు కాకుండా మిగతా సినిమాలకు భిన్నంగా ఉంటుందీ సినిమా" అని చెప్పారు.

## క్రికెటర్‌తో ప్రేమలో తమన్నా!



టాకీస్: తమన్నా గురించి సౌత్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన అందం, అభినయంతో తనకంటూ ప్రత్యేక పేరు సంపాదించుకుంది. ఈ క్రమంలో గతంలో ఈ హీరోయిన్ గురించి వైరల్ అయిన ఒక వార్త ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. సౌత్ ఇండియాలో అన్ని భాషల్లో నటించింది హీరోయిన్ తమన్నా. ఇక సౌత్ లోనే కాకుండా నార్త్ లో కూడా తనకంటూ మంచి పేరు సంపాదించుకుంది. ముఖ్యంగా తమిళ, తెలుగు ఇండస్ట్రీలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది ఈ హీరోయిన్. ప్రస్తుతం సినిమాలతోనే కాకుండా డిజిటల్ స్క్రీను ఏరియాలో కూడా వెబ్ సిరీస్ తో తన హవా కొనసాగిస్తుంది. ఇక తమన్నా గత కొద్దిరోజులు నుంచి విజయవర్మతో ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ తమ ప్రేమని అధికారికంగా వెల్లడించడమే కాకుండా ఎన్నో ఈవెంట్స్ లో కలిసి కనిపించి మీడియా ముందర హల్చల్ చేశారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ కొద్దిరోజుల నుంచి మాత్రం వీరిద్దరూ బ్రేకప్ అయ్యారు అనే వార్త తెగ వైరల్ అవుతుంది. అయితే తమన్నా గురించి రూమర్స్ కొట్టేమీ కాదు. గతంలో కూడా ఒక పెద్ద రూమర్ తెగ వైరల్ అయింది. అదేమిటి అంటే స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ.. తమన్నా అప్పట్లో ప్రేమించుకున్నారు అని తెగ వినిపించింది. అయితే వీరిద్దరూ కూడా ఈ విషయం గురించి ఎప్పుడూ అధికారికంగా వెల్లడించలేదు. ఇక ఆ తరువాత కొన్ని విభేదాలు వల్ల విడిపోయారని అప్పుడే విరాట్ కోహ్లీ అనుష్క శర్మతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు అన్న వార్తలు వచ్చాయి.. వీటిల్లో నిజం ఎంతుందో తెలియదు కానీ ఈ మధ్య విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సమయంలో.. ఈ రూమర్ కూడా మరోసారి వినిపిస్తోంది.

## ఓజీ నుంచి క్రేజీ అప్‌డేట్..!



**టాకీస్:** పవన్ అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న సినిమా ఓజీ. రాజకీయాల్లో బిజీగా మారిన తర్వాత పవన్ వెండి తెరపై పెద్దగా కనిపించలేదు. అయితే ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను శరవేగంగా పూర్తి చేసే పనిలో పడ్డారు పవన్. ప్రస్తుతం పవన్ నటిస్తున్న చిత్రాల్లో ఓజీ ఒకటి. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీలుక్ ఇప్పటికే చిత్రంపై భారీగా అంచనాలను పెంచేసిన విషయం తెలిసిందే. ఆ తరవాత విడుదలైన గ్లింప్స్ వీడియోతో టాలీవుడ్‌ను మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. నిజానికి ఈ సినిమాను గతేడాది విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే పవన్ రాజకీయాల్లో బిజీగా మారడంతో సినిమా విడుదల వాయిదా పడింది. ఇటీవల కొన్ని వారాలుగా షూటింగ్ నిలిచిపోయిన ఈ చిత్రం తిరిగి సెట్స్ పైకి వచ్చేసింది. కెమెరా టీమ్‌లోని ఒక సభ్యుడు ట్విట్టర్ ద్వారా "ఈ రోజు షూటింగ్ తిరిగి మొదలైంది" అంటూ ఓ ట్వీట్ చేయగా, అదే ట్వీట్‌ను ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా రీట్వీట్ చేస్తూ "మళ్లీ మొదలైంది.. ఈసారి మోగిపోద్ది" అంటూ పవన్ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం రేపింది. దీంతో హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నాడు. గతంలో 'పంజా' సినిమాలో కొద్దిగా గ్యాంగ్‌స్టర్ షేడ్స్ ఉన్న పాత్ర చేసిన పవన్, ఈసారి పూర్తి స్థాయి బ్రూటల్ గ్యాంగ్‌స్టర్‌గా తెరపై సందడి చేయనున్నారు. అంతే కాదు, ఈ చిత్రంలో పవన్ మూడు విభిన్న పాత్రలతో కనిపించబోతున్నట్లు సమాచారం.

## భారీ హిట్ దిశగా సింగిల్

**టాకీస్:** చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయం సాధించింది సింగిల్. కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు హీరోగా కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించారు. మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజు దర్శకత్వం వహించగా.. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ పతాకాలపై విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరిలు సంయుక్తంగా సింగిల్ చిత్రాన్ని నిర్మించారు. వెన్నెల కిశోర్, వీటీవీ గణేష్, కల్పలత తదితరులు ఇతర కీలకపాత్రలు పోషించారు. సింగిల్ సినిమా బడ్జెట్ ఎంత? ప్రీ రిలీజ్ బిజినెస్ ఎంత? ఐదు రోజుల్లో ఈ సినిమా ఎన్ని కోట్లు వసూలు చేసింది ? అనే వివరాల్లోకి వెళితే.. సింగిల్ చిత్రాన్ని సుమారుగా 15 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందించగా, ఈ సినిమాకు దాదాపు 7 కోట్ల రూపాయలు జరిగినట్లుగా ఫిలింనగర్ వర్గాలు తెలిపాయి. సింగిల్ చిత్రం లాభాల్లోకి రావాలంటే రూ.8 కోట్ల షేర్.. రూ.16 కోట్ల గ్రాస్ వసూలు చేయాలని ట్రేడ్ పండితులు విలువ కట్టారు. మే 9న సుమారుగా తెలుగు రాష్ట్రాల్లో 400 స్క్రీన్లలో, ప్రపంచవ్యాప్తంగా 700 స్క్రీన్లలో సింగిల్ సినిమాను రిలీజ్ చేశారు. సింగిల్ మూవీకి తొలి రోజు ఇండియాలో రూ.2.5 కోట్ల ఓపెనింగ్స్ రాగా.. ప్రపంచవ్యాప్తంగా రూ.4.15 కోట్ల వసూళ్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. హీరో శ్రీవిష్ణు కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్స్




రాబట్టిన సినిమాగా సింగిల్ నిలిచింది. ఆ తర్వాత రెండో రోజు రూ.3.5 కోట్ల నెట్, మూడో రోజు రూ.3.55 కోట్ల నెట్, నాలుగో రోజు రూ.1.7 కోట్ల చొప్పున నాలుగు రోజుల్లో సింగిల్ మూవీ రూ.11 కోట్ల నికర వసూళ్లు సాధించింది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన సింగిల్ మూవీకి యువత బ్రహ్మరథం పడుతున్నారు. శ్రీవిష్ణు - వెన్నెల కిషోర్ కామెడీతో థియేటర్‌లో ప్రేక్షకులు పడిపడి నవ్వుకుంటున్నారు. ఐదో రోజైన మంగళవారం సింగిల్ మూవీకి 24.34 శాతం థియేట్రికల్ ఆక్యుపెన్సీ నమోదైనట్లు సాక్‌నిల్క్ తెలిపింది. ఐదో రోజు హైదరాబాద్‌లో 328, బెంగళూరులో 155, విజయవాడలో 99, విశాఖలో 119 షోలు పడినట్లు వెల్లడించింది. మంగళవారం సింగిల్ మూవీ ఇండియాలో నికరంగా రూ.1.33 కోట్లు రాబట్టింది.



## కేన్స్ 2025లో ఊర్వశి రౌతేలా క్యాట్‌వాక్

**టాకీస్:** 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ మంగళవారం అంగరంగ వైభవంగా మొదలైంది. ప్రతీసారి లాగే, ఈసారి కూడా బాలీవుడ్ బ్యూటీ, డాకు మహారాజ్ ఫేమ్ ఊర్వశి రౌతేలా రెడ్ కార్పెట్‌పై తనదైన స్టైల్‌లో మెరిసింది. బోల్డ్ ఫ్యాషన్ ఛాయిస్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ ముద్దుగుమ్మ, ఈసారి రంగురంగుల డ్రెస్సులో, మిలమిల మెరిసే చిలుక ఆకారంలో ఉన్న క్లచ్‌తో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. కొందరు ఆమె లుక్‌కి ఫిదా అయితే, మరికొందరు మాత్రం సోషల్ మీడియాలో సరదాగా ట్రోల్స్ వేస్తూ రచ్చ చేశారు. దీంతో మిక్స్‌డ్ రెస్పాన్సెస్ వచ్చాయి. ఊర్వశి రంగురంగుల ఫిష్‌టైల్ గౌనులో దర్శనమిచ్చింది. ఈ స్ట్రాప్‌లెస్ డ్రెస్సులో రెడ్, బ్లూ, యెల్లో కలర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనికి తోడు పొడవాటి ట్రైల్ (పొడవాటి తోక లాంటిది) ఈ ముద్దుగుమ్మ లుక్‌కి మరింత డ్రామాటిక్ టచ్ ఇచ్చింది. ఈ డ్రెస్సుకి తగ్గట్టుగా మ్యాచింగ్ కిరీటం, పెద్ద చెవిపోగులు, బోల్డ్ ఐ మేకప్‌తో అదరగొట్టింది. ఈ మొత్తం గెటప్, కేన్స్‌లో ఈ ఐటమ్ బాంబ్ "ఔట్ -ఆఫ్-ది-బాక్స్" స్టైల్‌ని కళ్లకు కట్టింది. కానీ, అందరి కళ్లూ ఆమె చేతిలో ఉన్న స్పెషల్ యాక్సెసరీ మీదే పడ్డాయి. అదే చిలుక ఆకారంలో క్రిస్టల్స్‌తో పొదిగిన క్లచ్‌ఈ క్లచ్‌ను ప్రముఖ లగ్జరీ డిజైనర్ జుడిత్ లీబర్ తయారుచేశారు. దీని ఖరీదు సుమారు 5,495 డాలర్లు (అంటే మన కరెన్సీలో దాదాపు రూ.4,68,000). చిలుక ఆకారంలో, మొత్తం క్రిస్టల్స్‌తో తళతళలాడుతున్న ఈ బ్యాగ్ క్షణాల్లో అందరి దృష్టినీ లాగేసింది. ఊర్వశి కూడా ఫొటోగ్రాఫర్లకు పోజులిస్తూ ఆ విచిత్రమైన క్లచ్‌కి ముద్దు పెడుతూ రెడ్ కార్పెట్ మీద మరింత హడావిడి చేసింది. ప్రముఖ ఫ్యాషన్ వాచ్‌డాగ్ 'డైట్ సబ్యా' ఈ లగ్జరీ యాక్సెసరీ గురించి పోస్ట్ చేసి, దాని ధరను బయటపెట్టడంతో సోషల్ మీడియాలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఊర్వశి తన కేన్స్ ఎంట్రీ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన వెంటనే, కామెంట్ల వర్షం కురిసింది. ఆ వీడియోలో ఆమె లగ్జరీ కారు దిగి, తన ప్యారట్ క్లచ్‌ను గర్వంగా పట్టుకుని రెడ్ కార్పెట్ వైపు నడుస్తూ కనిపించింది. ఫ్యాన్స్ ఈ భామ బోల్డ్ లుక్‌ని మెచ్చుకుంటే, నెటిజన్లు మాత్రం సెటైర్లతో ఒక ఆట ఆడుకున్నారు. "తెల్లవారుజామున 3 గంటలకు పోస్ట్ చేసిన మొదటి భారతీయ నటి" అని ఒకరు, "విదేశంలో కారు దిగిన మొదటి భారతీయ మహిళ" అని మరొకరు చమత్కరించారు. ఐశ్వర్య రాయ్ బచ్చన్ 2018 కేన్స్ లుక్‌తో కూడా కొందరు పోల్చారు. ఈ వాల్తేరు వీరయ్య నటి గతంలో చాలాసార్లు కేన్స్ ఫెస్టివల్‌కి హాజరైంది. ప్రతీసారి ఆమె వేసుకునే డ్రెస్సులు, ఎంచుకునే ఫ్యాషన్ చర్చనీయాంశంగా మారుతాయి. పొగడ్తలు వచ్చినా, ట్రోల్స్ వచ్చినా... ఈ స్కందా నటి మాత్రం ట్రెండింగ్‌లో ఉండటం ఖాయం.

## రొమాంటిక్ సీన్స్‌తో ఇరగదీశారు



టాకీస్: బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ తాజాగా యువ నటుడు ఇషాన్ ఖత్తర్ తో కలిసి నటించిన 'ది రాయల్స్' వెబ్ సిరీస్ హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్‌లో ఇద్దరి మధ్య ఇంటిమేట్ సీన్స్‌పై నెటిజన్ల కామెంట్లు తెగ వైరల్ అవుతున్నాయి. ఈ వెబ్‌సిరీస్‌లో తన కన్నా ఆరేళ్ల చిన్నవాడైన ఇషాన్ ఖత్తర్‌తో రొమాన్స్ చేయడం ఎలా అనిపించింది? అనే ప్రశ్నకు భూమి పెడ్నేకర్ స్పందిస్తూ "ఇంటిమేట్ సీన్స్ చేయడం అనేది చిన్న విషయం కాదు. ఆ సన్నివేశాల్లో కంఫర్ట్ ఫీలయ్యేలా ఇద్దరం ముందే బంధం పెంచుకున్నాం. ఇషాన్‌కి నేను కంఫర్ట్‌గా ఫీలయ్యాను కాబట్టి ఆ సీన్స్ నేచురల్‌గా వచ్చాయి" అంటూ చెప్పింది. భూమి పెడ్నేకర్ (34), ఇషాన్ ఖత్తర్ (28) మధ్య దాదాపు 6 ఏళ్ల వయసు తేడా ఉన్నా, స్క్రీన్‌పై ఇద్దరూ రొమాంటిక్ సీన్స్‌తో ఇరగదీశారని నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సిరీస్ ట్రైలర్, సీన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో ఉన్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.